క్లుప్తంగా

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



తానేష్‌పాలెంలో రామాలయం శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం గ్రామంలో ఉన్న తానేష్‌పాలెం ప్రాంతంలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తానేష్‌పాలెం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న రామాలయానికి వేద మంత్రోచ్ఛారణల మధ్య శ్రీకారం చుట్టారు. పరిసర ప్రాంతానికి చెందిన భక్తులు, సంఘపెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మల్లప్పదిబ్బలో చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

పెనుగొండ: పెనుగొండ శివారు మల్లప్పదిబ్బ పెద్దింట్లమ్మ ఆలయం వద్ద బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ మజ్జిగ పంపిణీ చేశారు. నిత్యం వందలాదిగా ప్రయాణించే వాహనదారులకు, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి పాదయాత్ర చేసే భక్తులకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వ్యాపారానికి నమ్మకమే పెట్టుబడి



ఆయిల్, ఫ్లోర్‌మిల్లును ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు.

నరసాపురం రూరల్: వ్యాపారానికి నమ్మకమే పెట్టుబడి అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని సీతారామపురం గ్రామంలో మాజీ సర్పంచ్ చినమిల్లి నాగేశ్వరరావు దంపతులు ఏర్పాటు చేసిన రాజేశ్వరి ఆయిల్, ఫ్లోర్ మిల్లును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కేంద్ర కమిటీ సభ్యుడు పీడీ రాజు, పెన్మెత్స సుబ్బరాజు, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న తదితరులు పాల్గొన్నారు.

సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యం

కాళ్ల: ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు తాగునీటి వ్యవస్థను పెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటే ఆరోపణలు చేయటం సరికాదని ఉండి డీసీ చైర్మన్ తోట ఫణిబాబు, పెద అమిరం గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరం అన్నారు. కాళ్ల మండలం పెద అమిరంలో నీటి సంఘాల అధ్యక్షులతో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ఏఎస్ఆర్ నగర్ వాసులకు న్యాయం చేయాలి

పాలకోడేరు: అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో 150చదరపు గజాల్లో ఇళ్ళు నిర్మాణం చేసుకున్న పేదలకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు ఇస్తామన్న ఆదేశాలను పాలకోడేరు ఎ.ఎస్.ఆర్ నగర్ లో పేదల గృహాలకు అమలు చెయ్యాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జేఎన్వి గోపాలన్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఏ.ఎస్.ఆర్ నగర్ లో ఇల్లు తొలగింపులో నిరాశ్రయులైన నిర్వాసితులకు సీపీఎం ఆధ్వర్యంలో ప్రతి రోజూ నిర్వహిస్తున్న భోజన శిబిరాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య, దున్నా మరియమ్మ, పాలా వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: పట్టణంలో 29వ వార్డు ప్రకాష్‌నగర్ ఎస్‌టి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా ప్రకాష్‌నగర్‌లో డ్రెయినేజీ, మంచినీటి కుళాయిలు, వీధిలైట్లు వెలగకపోవడం వంటి అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డి.త్రిమూర్తులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, దుర్గారావు పాల్గొన్నారు.

పేదల కోసమే పోరాటం

ఆకివీడు: సీపీఎం పేదల కోసమే పోరాటం చేస్తుందని పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు చెప్పారు. పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పేదల ఇళ్లు పీకివేయడం దారుణమన్నారు. పెంకి అప్పారావు, డోకల రవితేజ, రాంబాబు, ఉదయకుమారి పాల్గొన్నారు.

కాలనీ ఇలా.. నివసించేదెలా..?



రాజీవ్ కొత్తకాలనీలోకి ప్రవేశించిన రొయ్యల చెరువుల్లో నీరు



ఖాళీగా ఉన్న స్థలాల్లో భారీగా పేరుకుపోయిన కిక్కిస



రాజీవ్ పాతకాలనీలో నిర్మించిన గృహసముదాయం

- అక్రమ రొయ్యల చెరువులతో ఇక్కట్లు
- రాజీవ్‌కాలనీని ముంచెత్తుతున్న నీరు

పెనుమంట్ర: అనధికార లేఅవుట్‌లు, అక్రమ అనుమతులతో తవ్విన రొయ్యల చెరువులు కారణంగా పెనుమంట్రలో రాజీవ్ కాలనీ వాసులు నానా అవస్థలు పడుతున్నారు. 20 ఏళ్లుగా రాజీవ్ కాలనీ పక్కన వేసిన అనధికార లేఅవుట్ సమస్యనేటికీ పరిష్కారం కాకపోగా, రాజీవ్ కాలనీకి దక్షిణం వైపు ఉన్న వరిచేలను అక్రమ అనుమతులతో రొయ్యల చెరువులు తవ్వడంతో చెరువుల నుంచి వస్తున్న మురుగునీరుతో డ్రెయిన్‌లు పూడుకుపోవడంతో నీరు కాలనీకి ప్రవేశిస్తుంది. దీంతో ఇటీవల కొత్తగా ఇచ్చిన రాజీవ్ కాలనీ లేఅవుట్‌లో ఇళ్లు కట్టుకున్న 30 మంది గృహవాసులు ఇబ్బందులు పడుతున్నారు.

అడవిని తలపిస్తున్న కాలనీ

ఈ కాలనీకి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకే పూడిక పనులు చేసి, 30 మందికి గృహ నిర్మాణ అనుమతులు ఇవ్వడంతో చాలా మంది నిర్మాణాలు కూడా పూర్తి చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం రావడంతో నిర్మాణాలు మధ్యలోనే నిలిచి కాలనీ అంతా కిక్కిస చెత్త పేరుకుపోయి ఇళ్ల చుట్టూ అడవిలా మారిపోయింది. అటు చెరువులు, ఇటు అక్రమ లేఅవుట్‌ల మధ్య వేసవిలో సైతం నీరు నిలిచిపోవడంతో కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. కాలనీలో పేరుకు పోయిన చెత్తను తొలగించడానికి , చెరువుల నుంచి వచ్చిన నీటిని గోస్తనీలోకి వెళ్లేందుకు మురుగు డ్రెయిన్‌లు పూడుకుపోయినా వాటిని తవ్వించే నాథుడు లేక రాజీవ్ కాలనీ వాసులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వేసవిలో ఇలాంటి పరిస్థితి ఉంటే, వర్షాకాలంలో తమ పరిస్థితి ఏంటి? అని వాపోతున్నారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి



స్టాలిన్‌బాబును అభినందిస్తున్న వినుకొండ ధనలక్ష్మి, రవికుమార్ దంపతులు

యలమంచిలి: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడం ద్వారా వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం తీసుకురావాలని ఏనుగువానిలంక ఎంపీటీసీ సభ్యురాలు వినుకొండ ధనలక్ష్మీ రవికుమార్ కోరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా ఉచ్చుల స్టాలిన్‌బాబు నియమితులైన నేపథ్యంలో బుధవారం ఆయన ఎంపీటీసీ సభ్యురాలు ధనలక్ష్మీరవికుమార్ దంపతులను మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ధనలక్ష్మీ రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వ నాయకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందక ప్రజలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే నాలుగేళ్లు కార్యకర్తలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లుల కొండ, దిడ్ల రాజబాబు, పాలపర్తి సందీప్, వీరా ఉమాశంకర్, పీతాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే సింహాచలం ప్రమాదం



పాలకొల్లులో మాట్లాడుతున్న కర్రా జయసరిత

పాలకొల్లు సెంట్రల్: సింహాచలం అప్పన్నస్వామి చందనోత్సవ సమయంలో గోడ కూలి ఏడుగురు మరణించడం చాలా దురదృష్టకరమని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత ఆవేదన వ్యక్తం చేశారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ కొత్తగా నిర్మించిన గోడ కూలిపోవడం పూర్తిగా ప్రభుత్వం, అధికారుల వైఫల్యమని ఆమె విమర్శించారు. భక్తులకు కనీస వసతులను కల్పించాల్సిన ప్రభుత్వం ఈ విషయంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తిరుమలలో తొక్కిసిలాట సమయంలో సరైన చర్యలు తీసుకోకపోవడం వల్లే అధికారుల్లో అలసత్వం పెరిగి ఆలయాల్లో ప్రమాదాలు పునరావృత్తమవుతున్నాయని ఆమె విమర్శించారు. సనాతన ధర్మం పేరుతో గుళ్లు చుట్టూ తిరుగుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సింహాచలంలో ప్రమాదం జరిగినా ఇంత వరకు ఎందుకు స్పందించలేదని ఆమె ప్రశ్నించారు. ఆలయాల్లో ఇలాంటి ప్రమాదాలు పునరావృత్తం కాకుండా ప్రమాద కారణ నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఆమె వెంట పార్టీ నాయకులు జోగాడ ఉమా మహేశ్వరరావు, జోగి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి చిట్టిబాబు, రామానుజుల చిన్న మధు, వీరా మల్లికార్జునుడు, పసుపులేటి కుమారి, జ్యోతి తదితరులు ఉన్నారు.

మేడపాడులో జాతర సందడి ప్రారంభం



వెంకమ్మ వారి పూజ ఘటానికి స్వాగతం పలుకుతున్న మహిళలు

యలమంచిలి: మేడపాడు గ్రామ దేవతలు వెంకమ్మ, కనకదుర్గమ్మ, జువ్వాలమ్మ అమ్మవార్ల జాతర ఉత్సవాలు మంగళవారం రాత్రి అమ్మవార్లను పుట్టింటికి తీసుకురావడంతో ప్రారంభమయ్యాయి. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల ఆధ్వర్యంలో జాతర నిర్వహణ కమిటీ పర్యవేక్షణలో అమ్మవార్ల ఘటాలకు మంగళవారం రాత్రి ప్రధాన ఆలయం నుంచి బయటకు తీసుకువచ్చి మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పుల మధ్య ఊరేగింపుగా పుట్టింటికి తీసుకువచ్చారు. 15 రోజులపాటు అమ్మవార్లకు పుట్టింటి వద్ద ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ నెల 15, 16 తేదీల్లో జాతర అనంతరం బలిహరణ, ఊయల ఉత్సవం నిర్వహించి అమ్మవార్లను ఆలయ ప్రవేశం చేస్తారు. అప్పటి నుంచి ఐదు రోజులపాటు తీర్థ ఉత్సవాలు నిర్వహించడంతోపాటు ఆఖరి రోజు మాంసాహారంతో అన్నసమారాధన ఏర్పాటు చేయడంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి పుట్టింటిని హైటెక్ విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ఉద్యమంగా చేపట్టాలి



మహిళా రైతు తోరం కనకదుర్గను సన్మానిస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారులు

పాలకొల్లు సెంట్రల్: ప్రకృతి వ్యవసాయాన్ని రైతులంతా ఒక ఉద్యమంగా చేపట్టాలని ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఇన్‌చార్జి అప్పారావు కోరారు. ప్రకృతి వ్యవసాయ వార్షిక ప్రణాళిక రూపొందించడానికి మంగళవారం తిల్లపూడి, దగ్గులూరు గ్రామాలలో రైతులతో సమావేశం నిర్వహించారు. ముందుగా రెండు గ్రామాలలో ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యత వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందడమే కాకుండా వాతావరణంలో అనేక సానుకూల మార్పులు వస్తాయన్నారు. ఈ సందర్భంగా గత ఐదు సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళా రైతు తోరం కనకదుర్గకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంఎంటీఎల్ మురళి, రైతులు కామిశెట్టి అయ్యప్పనాయుడు, నీలం నారాయణమూర్తి, కలిదిండి రామచంద్రరావు, రేపల్లె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు పోరాడాలి



పెనుమంట్రలో మేడే సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పెనుమంట్ర: కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసేవరకు తమ పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయని పెనుమంట్ర మండల సీఐటీయూ కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్ పిలుపునిచ్చారు. మే 20న జరిగే సార్వత్రిక సమ్మెలో ప్రతి కార్మికుడూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన అన్నారు. మండల కమిటీ ఆధ్వర్యంలో సమ్మెకు సమాయత్తం చేసేందుకు ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బుధవారం పెనుమంట్ర ఐసీడీఎస్ ఆఫీసు వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మేడే పోస్టర్‌ను విడుదల చేశారు. మేడే స్ఫూర్తితో కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాల హక్కును కాపాడుకోవాలని ప్రతి కార్మికుడూ దీక్షతో వాడవాడలా మేడే జెండాను ఎగురవేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యుడు ఎ.సుబ్బరాజు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సాయిమహాలక్ష్మి, మంగతాయారు, కరుణశీల శాంతి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఆవు మరణంపై కౌన్సిల్ సమావేశంలో రచ్చ

అధికారుల తీరును తప్పుబట్టిన కౌన్సిలర్లు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్రీవెంకటరమణ

నరసాపురం రూరల్: పట్టణంలో రహదారులపై విచ్చల విడిగా సంచరిస్తున్నాయనే నెపంతో తీసుకువచ్చిన ఆవులను గోశాలకు తరలించకుండా నిర్బంధించడంతో మరణించింది. ఈ విషయంపై బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో అధికారుల తీరును కౌన్సిల్ తప్పుబట్టింది. దాదాపు పది రోజులుగా ఆవులను నిర్బంధించి ఉంచారని, దీంతో వేసవి కావడంతో ఎండ తీవ్రతకు తట్టుకోలేక గర్భం దాల్చిన ఆవు మరణించిందని సభ్యులు మండిపడ్డారు. రోడ్డుపై సంచరిస్తున్న ఆవులను గోశాలకు తరలించకుండా ఎండలో నిర్బంధించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఎండ తీవ్రతకు తట్టుకోలేక ఆవు మరణించడానికి కారుకులైన వారిని శిక్షించాలని కౌన్సిలర్లు సఖినేటిపల్లి సురేష్, కేసరి గంగరాజు, కొత్తపల్లి నాని తదితరులు కోరారు. సాధారణ సమావేశం ఎజెండా చదవక ముందే ఈ విషయంపై సమాధానం చెప్పాలని సభ్యులు కమిషనర్‌ను పట్టుబట్టారు. వీరికి తోడు కౌన్సిల్‌లోని మిగిలిన సభ్యులు కూడా ఈ విషయంపై పట్టుబట్టారు. పట్టణంలోని వైజయంతి థియేటర్ సమీపంలో పంది మాంసం విక్రయిస్తున్నారని ఆ దుకాణాన్ని ఎందుకు నిలిపివేయించలేదని కమీషనర్‌ను ప్రశ్నించారు. గతంలో పందులను నిర్బంధించి ఎందుకు వదిలేశారో? సమాధానం చెప్పాలని వైకేఎస్, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, సురేష్, పతివాడ పద్మ తదితరులు అధికారుల తీరుపై మండిపడ్డారు.

వైభవంగా తిరునక్షత్ర ఉత్సవాలు



శేషవాహనంలో స్వామి వారిని ఊరేగిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: పట్టణంలోని ఆదికేశవ ఎంబెరుమానార్ స్వామి వారి దేవస్థానంలో తిరునక్షత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం స్వామి వారి శేషవాహనం ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి స్వామివారిని గజవాహనంపై తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం తిరువై మొలి సేవ, తీర్థ ప్రసాదాలు వినియోగాలు జరిపారు. తొలుత ఆలయ స్థానాచార్యులు కె.వెంకటాచార్యులు తిరునక్షత్రాదిలను వారివారి సాధారణ మంత్రాలను, ప్రార్థనా శ్లోకాలు గురించి భక్తులకు సులభంగా అర్థమయ్యేరీతిలో వివరించిన తీరు ఆకట్టుకుంది. ఆలయ చైర్మన్, ఫౌండర్ ట్రస్టీలు పుప్పాల వెంకట కృష్ణారావు, పుప్పాల ఆదినారాయణ, ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రకుమార్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 7 గంటలకు బాల భోగంతో వైదిక కార్యక్రమాలు ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు రథోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ రామచంద్ర కుమార్ తెలిపారు.

భక్తులను కాపాడటమే ధర్మం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆకివీడు: సనాతన ధర్మంలో భక్తులను కాపాడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పేర్కొన్నారు. సింహాగిరిపై కొలువుదీరిన వరాహ లక్ష్మీ నర్సింహ స్వామి చందనోత్సవ కార్యక్రమానికి వెళ్లిన భక్తులు క్యూలైన్‌లో గోడ కూలి మృతి చెందిన సంఘటనపై బుధవారం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అత్యంత బాధాకరమైన సంఘటన అన్నారు. ఈ సందర్భంగా మండల, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య, అంబటి రమేష్ మాట్లాడుతూ భక్తులను, ప్రజలను మభ్యపెట్టే విధంగా కూటమి వ్యవహరిస్తుందన్నారు. కౌన్సిలర్ గేదెల అప్పారావు, మెప్మా మాజీ అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి మాట్లాడుతూ వర్షానికి గోడ కూలిపోయిందంటే దాని నిర్మాణం ఎంత దారుణంగా ఉందో స్పష్టమవుతుందన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, కౌన్సిలర్ నిమ్మల నాగు పాల్గొన్నారు.

కమిషనర్‌పై ధ్వజమెత్తిన కౌన్సిలర్లు

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్‌పై కౌన్సిల్ సమావేశం ధ్వజమెత్తింది. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన కౌన్సిలర్లు మూకుమ్మడిగా విరుచుకుపడ్డారు. మూడేళ్లు గడిచినా ఒక్క పనీ చేయించుకోలేకపోయామని వాపోయారు. దీంతో సమావేశంలో పలువురు కౌన్సిలర్లు ఒక్కసారిగా తమ ప్రశ్నలను సంధించడంతో సమావేశంలో గందరగోళం ఏర్పడింది. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో చైర్‌పర్సన్ హైమావతి మాట్లాడుతూ సమావేశంలో వచ్చిన సమస్యలను సమావేశం అనంతరం కార్యాలయానికి వచ్చి వాటి పరిష్కారానికి కౌన్సిలర్లు కమిషనర్ దృష్టికి, నా దృష్టికి తీసుకొచ్చారా అని ప్రశ్నించారు. నెలకోసారి మాత్రమే సమావేశంలో మీకు సమస్యలు గుర్తుకు వస్తాయా అని ప్రశ్నించారు. మంచినీటి సమస్య పరిష్కారానికి పలు చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యాలయంలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ఏ పనీ త్వరగా చేయలేకపోతున్నామన్నారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలకు ప్రభుత్వ స్థలాల వినియోగం

కాళ్ల: ప్రజల సామాజిక అవసరాలకు ప్రభుత్వ ఖాళీ స్థలాలను వినియోగంలోకి తీసుకురానున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కాళ్ల మండలంలోని పెదఅమిరం పంచాయతీ పరిధిలోని పలు ఖాళీ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వీఆర్వోను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ నాగేంద్ర, వీఆర్వో కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి

భీమవరం: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా కమిటీ బుధవారం డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకుల వేతనాలు పెంచాలని, నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలని, నైట్ వాచ్‌మెన్, అటెండర్ పోస్టులు వీఆర్ఏలతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉండి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు తింటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటామని ఎన్నార్పీ అగ్రహారం ఎంపీటీసీ ముస్నూరి సువర్ణలక్ష్మీ శ్రీనివాస్ అన్నారు. గ్రామంలోని సచివాలయం వద్ద ప్రకృతి వ్యవసాయంపై ఉండి డివిజన్ ఇన్‌చార్జి మహేష్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, అధికారులు మాట్లాడుతూ మూస పద్ధతిలో పండించే పంటలకు స్వస్తిపలికి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సంపాదించే ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రైతు బి.హరనాథరాజు, ప్రకృతి వ్యవసాయ మండల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

యలమంచిలి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పార్టీ అనుబంధ విభాగాలకు నూతన అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం రాత్రి జాబితా విడుదల చేసింది. రైతు విభాగ అధ్యక్షుడిగా మానుకొండ శ్రీనుబాబు, మహిళ విభాగానికి వినుకొండ ధనలక్ష్మీ, రైతు విభాగానికి మన్నే కోటేశ్వరరావు, బీసీ సెల్‌కు గుడాల సూర్యనారాయణ, ఎస్సీ సెల్‌కు యేనుగుపల్లి చంద్రశేకర్, ఎస్టీ సెల్‌కు సాలా వెంకటేశ్వర్లు, మైనారిటీ సెల్‌కు షేక్ చాన్ భాష, క్రిస్టియన్ మైనారిటీ సెల్‌కు పీటర్‌సన్ అబ్రహం లింకన్, స్టూడెంట్ వింగ్‌కు కర్రి సాగర్ ప్రసాద్, పంచాయతీరాజ్ వింగ్‌కు భూపతిరాజు సూర్పరాజు, మున్సిపల్ వింగ్‌కు జోగి వెంకటేశ్వరరావు, ఆర్‌టీఐ వింగ్‌కు గుంటూరు దుర్గా ప్రసాదరాజు, వలంటీర్స్ వింగ్‌కు కూత నరేంద్రరెడ్డి, గ్రీవెన్స్ వింగ్‌కు మన్నే వెంకట్రావు, వాణిజ్య విభాగానికి ఇజ్జాడ జోగేంద్రబాబు, వీవర్స్ వింగ్‌కు సప్పవరపుకోట రామలింగేశ్వర శివప్రసాద్, వైఎస్సార్ టీయూసీకుచింతపల్లి నాగ పుష్పారావు, అంగన్‌వాడీ వింగ్‌కు పైలా రాజశ్రీ, లీగల్ సెల్‌కు వడ్లపాటి ఆనందరాజు, కల్చరల్ వింగ్‌కు గోనబోయిన వెంకట దుర్గారావు, సోషల్ మీడియా వింగ్‌కు కుక్కల బాలచంద్రన్, ఐటీ వింగ్‌కు పోలుకొండ వెంకటేశ్వరరావు, దివ్యాంగుల విభాగానికి చేరుగొండి కిషోర్‌కుమార్, డాక్టర్స్ వింగ్‌కు మద్దా శ్రీనివాసరావు, ఇంటలెక్చువల్స్ ఫోరానికి పేద్ర భక్తాంజనేయులు, ఎంప్లాయిస్, పెన్షనర్స్ వింగ్‌కు పొత్తూరి రంగరాజు, బూత్ కమిటీస్‌కు వింగ్ బొడ్డు సుబ్బారావు, పబ్లిసిటీ వింగ్‌కు రెడ్డిమాసు నాగేంద్ర బాబులను నియమించారు.

ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌కు పరామర్శ



ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జస్టిస్ భవాని ప్రసాద్

నరసాపురం రూరల్: ఆదికేశవ ఎంబెరు మన్నార్ స్వామి ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్, సీనియర్‌న్యాయవాది పుప్పాల వెంకట కృష్ణారావును, వారి కుటుంబ సభ్యులను హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ భవాని ప్రసాద్ బుధవారం పరామర్శించారు. ఇటీవల కృష్ణారావు తల్లి చంద్రావతి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న భవాని ప్రసాద్ పట్టణంలోని కోవెల వీధిలో నివసిస్తున్న కృష్ణారావు ఇంటికి వచ్చి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఇంద్రజాల రంగంలో బోస్ సేవలు ప్రశంసనీయం

భీమవరం: కళారత్న పురస్కారం అందుకున్న భీమవరం పట్టణానికి చెందిన ఇంద్రజాలికుడు, రచయిత మేజిక్ స్టార్ బోస్‌ను బుధవారం పాలకొల్లు పట్టణానికి చెందిన హరివిల్లు సాంస్కృతిక సంస్థ ఘనంగా సన్మానించింది. పాలకొల్లు లయన్స్ క్లబ్‌లో నిర్వహించిన అభినందన సభలో హరివిల్లు వ్యవస్థాపక అధ్యక్షుడు వంగా నర్సింహారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ బోస్ సేవలను కొనియాడారు. హరివిల్లు ప్రధా న కార్యదర్శి యర్రంశెట్టి వెంకటరత్నం, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వర్మ, గుండా రామకృష్ణ పాల్గొన్నారు.

శ్రీశ్రీ సేవలు ఎనలేనివి

భీమవరం: ప్రజల్లో సామాజిక స్పృహ కల్పించడానికి శ్రీశ్రీ అభ్యుదయ రచయితగా ఎనలేని సేవ చేశారని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పుల నాగేశ్వరావు అన్నారు. బుధవారం శ్రీశ్రీ జయంతిని నిర్వహించారు. అనంతరం శ్రీశ్రీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో చాంద్ బాషా, ఎం.శ్రీనివాసరావు, ముస్తఫా ఆలీ, తదితరులు పాల్గొన్నారు.